## క్లుప్తంగా

### చింతచెట్టుకు నిప్పు...

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారులో కర్నూలు- గుంటూరు రాష్ట్ర రహదారికి పక్కన వున్న చింతచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు పెద్దవిగా లేవడం చెట్టు సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు ఉండటం గమనించిన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఏఈ పుల్లారెడ్డి, సత్తెనపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే చెట్టు మొదలు భాగం దహనం కావడంతో పొక్లెయిన్‌తో చెట్టును రోడ్డు వైపునకు కూల్చి వేశారు. ఏఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ చెట్టు పూర్తిగా దహనం కావడంతో తీగలపై కూలిపోయే పరిస్థితి ఏర్పండిందని స్థానికుల సమాచారంతో చెట్టును రోడ్డువైపునకు పడేలా చేశామన్నారు. ఆయన వెంట లైన్‌ఇన్‌స్పెక్టర్ శివకుమార్, లైన్‌మెన్లు అశోక్, అసిస్టెంట్ లైన్‌మెన్స్ చల్లా శ్రీనువాసరెడ్డి, ఇజ్రాయిల్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

### వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్‌నిపాడులోని చెరువుకొండవద్ద వినాయకుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. కొండవీడు రెడ్డిరాజుల ఆస్థాన విద్వాంసుడు శ్రీనాథుడు ప్రతిష్ఠించి పూజించిన విగ్రహం ఇటీవల గుర్తు తెలియని దుండుగుల చేతిలో ధ్వంసం కావడంతో హౌస్ గణేషునిపాడు, మరియు కొత్తపాలెం గ్రామస్తుల సహకారంతో 11 అడుగుల నూతన గణేషుని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం మూడు రోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమాలను పరుచూరి మాధవాచార్యులు, నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ పర్యవేక్షించారు.

### తుళ్లూరు ఎంపీడీఓగా శివన్నారాయణ



తాడికొండ: తుళ్లూరు ఎంపీడీఓగా బి.శివన్నారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన ఎ.శ్రీనివాసరావును ఇక్కడి నుంచి పొన్నూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన శివన్నారాయణ బాధ్యతలు చేపట్టారు.

### అంకితభావంతో పనిచేయాలి

గుంటూరు మెడికల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలందరికీ చేరే విధంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చెప్పారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాల్ని నిర్ణీత గడువులోగా చేరుకుని జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో దిగువ స్థానంలో ఉన్న ఉప కేంద్రాల వైద్యాధికారులతో సమీక్షలు జరిపి వారిలో నైపుణ్యాన్ని, పనితనాన్ని మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డాక్టర్ రత్న మన్మోహన్, డీఐవో డాక్టర్ కె.వి. సుబ్బరాజు, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్


తెనాలిరూరల్: నిబంధనలను అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు హెచ్చరించారు. తెనాలి ఎంవీఐ కార్యాలయ పరిధిలో వివిధ చోట్ల బుధవారం వాహన తనిఖీలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో, ఇతర వాహనాలల్లో ఎక్కించుకోకూడదన్నారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి డ్రైవర్లు/యజమానులు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి నిబంధనలు అతిక్రమించి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని, హెచ్చరించారు.

### అర్హులందరికీ పనులు కల్పించాలి

కొల్లిపర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన కూలీలందరికీ పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ పి.బాలమ్మ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బృందం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల ఉపాధిహామీ పథకానికి చెందిన రికార్డులను పరిశీలించారు. ఉపాధి పనులపై ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏపీడీ బాలమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 2022, 23 సంవత్సరాల్లో రూ.4కోట్ల50 లక్షల20వేలు ఉపాధి హామీ పనులు జరిగాయని, వీటిపై తనిఖీ చేయటం జరిగిందన్నారు. సన్న, చిన్న కారు రైతులు నిమ్మ, నేరేడు, జామ, మునగ, పశువులకు పచ్చిగడ్డి లాంటి పంటలు వేస్తే సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని కోరారు.

# సొంత ఇంటి కల నెరవేర్చడమే ధ్యేయం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- నిడమర్రు, నవులూరు లేఅవుట్ పరిధి పేదలకు పట్టాల పంపిణీ



ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: పేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. సీఆర్‌డీఏ పరిధిలోని నిడమర్రు, నవులూరు రెవెన్యూ పరిధి యర్రబాలెం ఆర్-5 జోన్ లేఅవుట్ల పరిధిలోని పేదలకు బుధవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేని ఏ ఒక్క నిరుపేద ఉండకూడదనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో లక్షలాది మంది పేదలకు గృహాలను నిర్మించారని, నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 33 లక్షల మంది పేదలకు నివాస గృహాలను నిర్మించి గూడు కల్పించారని గుర్తు చేశారు. అందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధి ఆర్-5 జోన్‌లో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన సుమారు 53వేల మంది పేదలకు నివేశన స్థలాలు కేటాయించగా, మంగళగిరి నియోజకవర్గంలో 23వేల మంది పేదలకు నివాస గృహాలు మంజూరు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు.

### సంతోషంగా ఉంది



ఐదేళ్ల టీడీపీ పరిపాలనలో నివేశన స్థలం కోసం పలుమార్లు సార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. సీఎం జగనన్న పరిపాలనలో ఇంటి స్థలానికి దరఖాస్తు చేసిన వెంటనే పట్టా మంజూరైంది. సొంతింటి పట్టా అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. గత కొన్నేళ్ల సొంత ఇంటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తమ వంతు అండగా నిలబడతాం.

–పదరాజు, తాడేపల్లి

### ఈ వయసులో స్థలంతో ఆనందం



ఇంటి స్థలం కోసం గత కొన్నేళ్లుగా ఎదురు చూపులు చూస్తున్న తరుణంలో సీఎం జగన్ స్థలం మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లోనే జీవిస్తూ ఎన్నో కష్టాలను అనుభవించా. వాటిని ఇప్పుడు తలచుకుంటేనే ఎంతో బాధ కలుగుతుంది. వృద్ధాప్యానికి చేరుకున్న క్రమంలో తనకు సొంత ఇంటి స్థలం రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం మంజూరు చేసే ఆర్థిక సహాయంతో సొంత ఇంటిని నిర్మించుకోవాలని ఎదురు చూస్తున్నా.

–వేమవరపు సుందరమ్మ, మంగళగిరి

## అన్ని వర్గాలకు సంక్షేమం అందించడమే జగనన్న లక్ష్యం

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్
- బడేపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తున్న కత్తెర సురేష్ కుమార్

బడేపురం(తాడికొండ): అన్ని వర్గాలకు సంక్షేమం అందిచడమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. తాడికొండ శివారు బడేపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కత్తెర మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని అందించి ప్రజల సమస్యలు తీర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. కార్యక్రమంలో తాడికొండ, నిడుముక్కల సర్పంచులు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఎంపీటీసీ పాలడుగు దాసు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, బెజ్జం సాయిప్రసాద్, కొమ్మినేని పున్నారావు, మాతంగి మాధవ, కొదమల విజయ కుమారి, షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు.

### ఉండవల్లిలో సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే ఆర్కేకు సీపీఎం నేతల వినతి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి ఉండవల్లి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేతలు బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ను కలసి వినతి పత్రం అందజేశారు. ఉండవల్లిలోని అమరారెడ్డి కాలనీ, టెలిఫోన్ కాలనీ, ఉప్పునీళ్ల బావి ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, కుమ్మరికుంట గ్రామ కంటకంలో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నేతలు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్కే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఎం నేతలు ఎం.రవి, వి.వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి, యు.పార్థసారథి, టి.శివయ్య తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

### అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ



తాడికొండ: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తాడికొండ-1 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ పాఠశాలకు పంపించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించి చిన్నారుల భవితకు బంగారు బాటలు వేయడంలో అంగన్‌వాడీల పాత్రను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ఎంపీ సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

## వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో అనేక లోపాలు, అసంబద్ధమైన విషయాలు, అశాస్త్రీయమైన నిబంధనలు, తప్పులతడకగా ఉన్న సాఫ్ట్‌వేర్‌తో ఉపాధ్యాయుల్లో గందరగోళానికి కారణమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీల్ని బ్లాక్ చేయడంతో ఉపాధ్యాయులందరూ తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారన్నారు. తక్షణమే బదిలీల్ని మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా నిర్వహించేందుకు విద్యాశాఖ మంత్రి అంగీకరించినప్పటికీ, అధికారులు అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బదిలీ అవుతున్న ఉపాధ్యాయుల పోస్టుల కంటే 30 శాతం అదనంగా ఖాళీలు చూపించాలని విద్యాశాఖ మంత్రి చెప్పినప్పటికీ, అధికారులు అందుకు భిన్నంగా ఎక్కువ మొత్తంలో ఖాళీలు బ్లాక్ చేయడం అత్యంత బాధాకరమని తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో అనేక సర్వర్ సమస్యలు ఉండటంతో పాటు సీనియార్టీ, ఖాళీల జాబితాలు ఆలస్యంగా విడుదల చేసిన దృష్ట్యా వెబ్ ఆప్షన్ నమోదుకు గడువు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ సీహెచ్. ఉమ, ఉపాధ్యాయవాణి జిల్లా కన్వీనర్ షేక్ బాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్. భానుమూర్తి, కె.వి.రమణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: రోడ్ల నిర్మాణ పనుల్లో అధికారులు నిత్యం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సూచించారు. బుధవారం ఆయన నగర పరిధిలోని నూతక్కి నుంచి మెల్లెంపూడి వరకు, మెల్లెంపూడి నుంచి కేఎల్ యూనివర్సిటీ వరకు సుమారు రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ త్వరితగతిన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

**కమ్యూనిటీహాల్స్ నిర్మాణ పనుల పరిశీలన...**

నగర పరిధిలోని బేతపూడి బాపూజీనగర్, దళిత శిబిరంలో తుది దశకు చేరుకున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగర పాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. బాపూజీనగర్ ముఖద్వారం వద్ద బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం, శిబిరం కమ్యూనిటీ హాలు వద్ద బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆర్కే నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. తుది దశకు చేరుకున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లకు బెస్ట్ సీనియర్స్ అవార్డు



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న నాలుగు జిల్లాల గ్రూపు కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్

మంగళగిరి: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లకు బెస్ట్ సీనియర్స్ అవార్డులు దక్కాయి. బీటెక్ చదువుతున్న విద్యార్థులు ఈ నెల 1వ తేదీన జిల్లా స్థాయి వార్షిక శిక్షణ గోళ్లమూడిపాడులోని నాట్కో కేంద్రీయ విద్యాలయానికి తరలివెళ్లారు. ఈసందర్భంగా విద్యార్థులు లెఫ్టినెంట్ వి.మౌనిక ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లకు కేఎల్‌యూకు చెందిన సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ శిబిరానికి నాయకత్వం వహించి ఉత్తమ సేవ మార్గదర్శకత్వాన్ని అందించినందుకు గానూ నాలుగు జిల్లాల గ్రూప్ కమాండర్ ఎస్ఎం చంద్రశేఖర్ బెస్ట్ సీనియర్స్ అవార్డు అందించి అభినందించారు. అవార్డు అందుకున్న వారిలో 22వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు వి.సాత్విక్, జి.సాయిలక్ష్మి ఉన్నట్లు లెఫ్టినెంట్ మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు క్యాడెట్లను అభినందించారు.

## 16న పెరియార్ సమకాలీనతపై సదస్సు



పెరియార్ సమకాలీనత సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంగళగిరి: పెరియార్- సమకాలీనతపై సదస్సు ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల విల్సన్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహం ఎదుట పెరియార్ - సమకాలీనత సదస్సు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. విల్సన్ మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన మందిరంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి సమాజంలో పెరియార్ ఆలోచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌తో పాటు పలువురు పత్రికా సంపాదకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కిన్నెర చంద్రశేఖర్, రమేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## శాస్త్రీయంగా వరి విత్తుకుంటే పంటకు ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి



వరి విత్తడంపై సిబ్బందికి శిక్షణనిస్తున్న రాజకుమారి

దావులూరు(తెనాలి): ఖరీఫ్ సీజనుకు ముందుగా 30 రకాల విత్తనాలను పచ్చిరొట్టగా వేసుకుని, వచ్చిన పంటలను కలిపి దున్నకుండా, కోసి పశువులకు మేతగా వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి సూచించారు. కొల్లిపర మండల గ్రామం దావులూరులో అభ్యుదయ రైతు గొట్టిముక్కల శ్రీధర్ పంటపొలంలో బుధవారం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌ను 30 రకాల విత్తనాలతో ప్రారంభించారు. అంతరం నేలను దున్నకుండా వరి విత్తుకోవటంపై రాజకుమారి మండల సిబ్బందికి శిక్షణనిచ్చారు. పచ్చిరొట్ట పైరును కోశాక, నేలను దున్నకుండా తాడు సాయంతో వరి విత్తనాలను మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు, వరుస వరుసకు రెండు అడుగుల దూరంతో విత్తుకోవాలని సూచించారు. దీనివల్ల పైరుకు గాలి, నీరు సమపాళ్లలో అందుతుందనీ, చీడపీడల బెడద తప్పుతుందని చెప్పారు. రైతు శ్రీధర్ మాట్లాడుతూ గతేడాది కూడా ఇదే పద్ధతిలో వ్యవసాయం చేయటంవల్ల భూమి సారవంతమైనట్టు చెప్పారు. వరి పంటలో ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడకుండానే మంచి దిగుబడులు వచ్చాయని తెలియజేశారు. రెండో పంటగా వేసిన మొక్కజొన్న కూడా మంచి దిగుబడి రావటంతో పాటు, ఐటీసీ ద్వారా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష చేయించగా, రసాయన రహితమని నివేదిక కూడా వచ్చిందన్నారు. కార్యక్రమంలో కొల్లిపర మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓఆర్‌ఎస్‌తో డయేరియా కట్టడి

అతిసార (డయేరియా) వ్యాధి సోకినప్పుడు తల్లిదండ్రులు చేసే కొద్దిపాటి నిర్లక్ష్యంతో పిల్లల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. సకాలంలో చికిత్స అందిస్తే ముప్పు తప్పుతుంది. ఏటా జిల్లాలో మూడు వేల మంది చిన్నారులు వ్యాధి బారిన పడుతున్నారు. సకాలంలో చికిత్స చేయించకపోవడం వల్ల 2019-20లో 15 మంది ఐదేళ్లలోపు చిన్నారులు మరణించారు. 2020-21లో 13 మంది, 2021-22లో 12 మంది. 2022-23లో తొమ్మిది మంది చనిపోయారు. పిల్లల్లో డయేరియా మరణాల్ని నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'అతిసార వ్యాధి నియంత్రణ' పక్షోత్సవాల్ని నిర్వహిస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

- ముందస్తు జాగ్రత్తలతో పిల్లల్లో మరణాల నివారణ
- ఈనెల 17 వరకు అతిసార పక్షోత్సవాలు
- ఉచితంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జింక్ మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



అతిసార అవగాహన పోస్టర్లు

గుంటూరు మెడికల్: ఐదేళ్లలోపు పిల్లలకు రోజులో మూడు సార్లుకంటే ఎక్కువ సార్లు విరేచనాలు (మోషన్స్) అవ్వడం, అందులో నీటి శాతం ఎక్కువగా ఉంటే దాన్ని అతిసారగా గుర్తించి తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యాధి వైరస్ ద్వారా సోకుతోంది. వ్యాధి సోకిన చిన్నారుల్లో శరీరంలో నీటి శాతం బాగా తగ్గిపోతుంది. బిడ్డకు చంచలత్వం, చిరాకు, మైకం, అపస్మారకస్థితి, కళ్లు లోపలికి వెళ్లినట్లు ఉండటం, చర్మం స్థితిస్థాపకత లేకపోవడం, నొక్కినప్పుడు చాలా నెమ్మదిగా సాధారణ స్థితికి చేరుకుంటుంది. బిడ్డ చాలా దాహంతో ఉండటం, నీరు తాగులేకపోవడం లక్షణాలు కనిపిస్తే తక్షణమే డయేరియాగా నిర్ధారించుకుని వైద్యుల్ని సంప్రదించాలి.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు**

డయేరియాను ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌తో పూర్తిగా కట్టడి చేయవచ్చు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీటిని ఉచితంగా అందిస్తున్నారు. శుభ్రమైన పాత్రలో ఒక లీటరు తాగునీటిని పోసి నీటిని కాచి చల్లార్చి అందులో ఒక ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను పోయాలి. పరిశుభ్రమైన స్పూన్‌తో కలిసిపోయేలా తిప్పాలి. పిల్లవాడి వయస్సు, శరీర బరువును బట్టి ద్రావణం తాగించాలి. రెండు నెలలకంటే తక్కువ వయస్సు ఉన్న శిశువుకు ప్రతి విరేచనం తరువాత ఐదు స్పూన్లు పట్టించాలి. రెండు నెలల నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు ప్రతి విరేచనం తరువాత అరకప్పు, రెండు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఒక కప్పు తాగించాలి. వ్యాధి మొదలైన నాటి నుంచి విరేచనాలు తగ్గే వరకు ఓఆర్‌ఎస్ ఇవ్వాలి. పిల్లలకు విరేచనాలు అవుతున్నా కూడా బ్రెస్ట్ మిల్క్ ఆపకూడదు. దాంతో పాటు గంజి, కొబ్బరి నీరు, పలుచని పప్పుచారు ఇవ్వడం మంచిది. ఓఆర్‌ఎస్‌తోపాటు జింక్ మాత్రను కూడా పిల్లలకు ఇవ్వాలి. ఇది వ్యాధి తీవ్రతను తగ్గిస్తోంది.

### డయేరియా నియంత్రణే లక్ష్యం



జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణ, మరణాల నివారణే లక్ష్యంగా 15 రోజుల పాటు అవగాహన పక్షోత్సవాల్ని నిర్వహిస్తున్నాం. ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారుల్ని గుర్తించి వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందిస్తున్నారు. హ్యాండ్ వాష్‌పై ఆసుపత్రుల్లో, ఇళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లలు వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ కుర్రా వీరసుబ్బరాజు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

### ఉచితంగా వైద్యసేవలు



డయేరియా సోకిన చిన్నారులకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలందిస్తున్నాం. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ - జింక్ కార్నర్లు ఏర్పాటు చేశాం. డయేరియా సోకిన చిన్నారులకు చికిత్స అందించే విధానంపై వైద్యులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌వో, గుంటూరు

## శాస్త్రీయ సమాజ నిర్మాణమే లక్ష్యం



సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, జేవీవీ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) లక్ష్యమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జేవీవీ జిల్లా కార్యవర్గ సమావేశంలో సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ ప్రచార ఉద్యమంలో 35 ఏళ్ల ప్రస్థానం కలిగిన జేవీవీ ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో అనేక కార్యక్రమాల్ని నిర్వహిస్తోందని తెలిపారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో విద్యావంతులు సైతం మూఢ నమ్మకాల్ని నమ్ముతున్నారని, ప్రతి ఒక్కరు శాస్త్రీయంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ అహ్మద్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్, జి. వెంకటరావు, టి. జాన్‌బాబు, ఎం. ఉదయభాస్కర్, ఎండీ. అక్బర్, ఈ. అనిల్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.